అక్రమ అరెస్టులు అన్యాయం

శ్రీకాకుళం సిటీ: సోషల్ మీడియా పేరుతో అక్రమ అరెస్టులతో పౌరుల జీవనానికి, స్వేచ్ఛకు కూటమి ప్రభుత్వం భంగం కలిగిస్తున్నారని అంతర్జాతీయ మానవహక్కుల సంఘం స్టేట్ సివిల్ రైట్స్ చైర్మన్ కరణం తిరుపతినాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. పౌరుల జీవనానికి భంగం కలిగించేలా ప్రభుత్వం వ్యవహరిస్తుందని అన్నారు. అక్రమ అరెస్టులపై స్పందించని ఎడల కలెక్టర్, ఎస్పిలపై డిఒపిటికు ఫిర్యాదు చేస్తానని హెచ్చరించారు. సోషల్ మీడియా అరెస్టులపై సుప్రీం కోర్టు మార్గదర్శకాలు జరిచేసినా ప్రభుత్వం పాటించట్లేదని అన్నారు. జిల్లాలో మంత్రి అచ్చెన్నాయుడు అరాచకాలు ఎక్కువయ్యాయని, ప్రతిపక్షాలపై తప్పుడు ఆరోపణలు, తప్పుడు కేసులు బనాయించి భయభ్రాంతులకు గురించేస్తున్నారని అన్నారు. తన తరగతికి చెందిన వాళ్లను అధికారులను నియమించి అ రాచకాలు సాగిస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. అక్రమ అరెస్టులను ఆపాలని డిమాండ్ చేశారు.

తొలి నెల ప్రతికూలమే

ఖరీఫ్ సీజన్‌లో ఒక నెల ముగిసింది. జూన్‌లో సాధారణంగా కురవాల్సిన వర్షపాతంలో భారీ లోటు కనిపిస్తోంది. నైరుతి రుతుపవనాలు ముందుగా ప్రవేశంతో మేలో వర్షాలు బాగానే కురిసినా, జూన్‌లో మాత్రం వానలు ముఖం చాటేశాయి. ఒడిశాలో వర్షాలు కురవకపోవడంతో వంశధార, నాగావళి నదుల్లో నీటి ప్రవాహం అంతంతమాత్రంగానే ఉన్నాయి. రిజర్వాయర్లలోనూ నీరు పెద్దగా చేరలేదు. జూలై నుంచి వంశధార నీటిని విడిచిపెట్టినా గొట్టాబ్యారేజీ వద్ద నీటి నిల్వలు లేకపోవడంతో, కాలువల్లోకి ఉన్నంత మేరకు నీటిని వదులుతున్నారు. జిల్లాతో పాటు ఒడిశాలో వానలు కురిస్తే, ఈనెలలో రిజర్వాయర్లలో నీటి నిల్వలు పెరిగే అవకాశాలు ఉన్నాయి. దీంతో పంటల సాగు జోరందుకోనున్నాయి.

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

వరి నాట్లు వేస్తున్న మహిళలు

- **జూన్‌లో 31.8 శాతం వర్షపాతం లోటు**
- **గతేడాది 4.4 శాతం మాత్రమే లోటు**
- **ప్రస్తుతం 95 వేల ఎకరాల్లో పంటల సాగు**

జిల్లాలో ఈ ఖరీఫ్‌లో అన్నిరకాల పంటలు కలిపి 4,07,488 ఎకరాల్లో వేసేలా అధికారులు ప్రణాళికలు సిద్ధం చేశారు. అందులో 3,76,773 ఎకరాల్లో వరి పంట సాగవుతుందని అంచనా వేశారు. సజ్జలు 90 ఎకరాల్లో సాగు ఉండొచ్చని అధికారులు అంచనాలు రూపొందించారు. మొక్కజొన్న 23,873 ఎకరాలు, రాగులు 43 ఎకరాలు వేయనున్నారు. పప్పుధాన్యాలకు సంబంధించి కంది, పెసర, మినప పంటలను కలిపి మొత్తం 388 ఎకరాల్లో రైతులు సాగు చేసే అవకాశముందని అంచనా వేశారు. వేరుశనగ 433 ఎకరాలు, నువ్వులు 30 ఎకరాల్లో సాగవుతుందని భావిస్తున్నారు. పత్తి 3,125 ఎకరాల్లో, గోగు పంట 98 ఎకరాల్లో సాగు చేయనున్నారు. చెరుకు 2,623 ఎకరాల మేర సాగయ్యేలా ప్రణాళికలు రూపొందించారు. ప్రస్తుతం అన్నిరకాల పంటలు కలిపి 95 వేల ఎకరాల్లో వేశారు.

జూన్‌లో 31.8 శాతం మి.మీ వర్షపాతం లోటు

జూన్‌లో సాధారణంగా 134.9 మి.మీ వర్షం కురవాల్సి ఉండగా, 92 మి.మీ వర్షం మాత్రమే కురిసింది. వర్షపాతం లోటు 31.8 మి.మీ శాతంగా నమోదైంది. గతేడాది 128.9 మి.మీ వర్షం పడింది. వర్షపాతం లోటు 4.4 శాతంగా నమోదైంది. ఖరీఫ్‌లో మొదటి నెల ముగిసే నాటికి హిరమండలం, సారవకోట, జి.సిగడాం మండలాలు తీవ్ర వర్షపాతం లోటును ఎదుర్కొంటున్నాయి. ఏడు మండలాల్లో సాధారణ వర్షపాతం నమోదైంది. ఒక్క ఎచ్చెర్ల మండలంలో కురవాల్సిన వర్షం కంటే ఎక్కువ వర్షపాతం నమోదైంది. ఇక్కడ సాధారణంగా 113.2 మి.మీ వర్షం కురవాల్సి ఉండగా 181.3 మి.మీ వర్షపాతం నమోదైంది.

రిజర్వాయర్లలో అంతంతమాత్రంగా నీటిమట్టం నిల్వలు

జూన్‌లో పెద్దగా వర్షాలు కురవకపోడంతో జిల్లాలోని రిజర్వాయర్లు, బ్యారేజీల్లో అంతంతమాత్రంగానే నీటిమట్టం నిల్వలు ఉన్నాయి. హిరమండలం మండలం గొట్టాబ్యారేజీ వద్ద 0.66 టిఎంసిల నీటి నిల్వలు ఉండాల్సి ఉండగా 0.64 టిఎంసిల నీరు ఉంది. తోటపల్లి రిజర్వాయర్ మొత్తం సామర్థ్యం 2.50 టిఎంసిలు కాగా, ప్రస్తుతం 2.26 టిఎంసిల నీరు అందుబాటులో ఉంది. మడ్డువలస రిజర్వాయర్ సామర్థ్యం 3.30 టిఎంసిలు కాగా, ప్రస్తుతం 2.90 టిఎంసిల నీరు మాత్రమే లభ్యమవుతోంది.

గార : హోలిస్టిక్ ప్రోగ్రెస్ కార్డును పరిశీలిస్తున్న కేంద్రమంత్రి, కలెక్టర్

జిల్లాను ఆదర్శంగా తీర్చిదిద్దుతాం

కేంద్ర పౌర విమానయానశాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు

ప్రజాశక్తి- గార, శ్రీకాకుళం సిటీ

జిల్లాను దేశానికే, ప్రపంచానికే ఆదర్శంగా నిలిపేందుకు తనవంతు కృషి చేస్తానని కేంద్ర పౌర విమానయానశాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు స్పష్టం చేశారు. వలసల జిల్లాగా పేరుపడిన శ్రీకాకుళం నుంచి ఇకపై ఎవరూ బయటకు వెళ్లకుండా ఇక్కడే పనిచేసుకునేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. గార జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాలలో కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధ్యక్షతన గురువారం నిర్వహించిన మెగా పేరెంట్ టీచర్ డే సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన సందర్భంగా ఈ వ్యాఖ్యలు చేశారు. జిల్లాను పారిశ్రామికంగా మరింత అభివృద్ధి చేయాల్సి ఉందన్నారు. పెట్టుబడిదారులు ఆనందంగా ముందుకు రావాలంటే మన దగ్గర నైపుణ్యం ఉన్న మానవ వనరులు అవసరమని పేర్కొన్నారు. పెద్ద అవకాశాలను దక్కించుకోవాలంటే ఉన్నత చదువులు అవసరమని అన్నారు. పాఠశాలల్లో ఎలాంటి సమస్యలున్నా వాటిని పరిష్కరించేందుకు కృషి చేస్తామని భరోసా ఇచ్చారు.

నాన్న చదువుకున్న బడికి రావడం ఆనందం

'మా నాన్న కింజరాపు ఎర్రన్నాయుడు ఇదే పాఠశాలలో చదువుకున్నారని, నేను ఇక్కడికి పేరెంట్స్ సమావేశానికి రావడానికి ఇదే ప్రధాన కారణంమని భావోద్వేగంగా చెప్పారు. విద్యార్థుల అభ్యున్నతికి అన్ని రకాల కృషి చేస్తున్నామని, డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకాన్ని పకడ్బందీగా అమలు చేస్తున్నామని తెలిపారు. పాఠశాలల్లో అన్ని మౌలిక వసతులు, సౌకర్యాలు కల్పిస్తామని హామీనిచ్చారు.

భవిష్యత్‌కు బాట : కలెక్టర్

కలెక్టర్ మాట్లాడుతూ మెగా పేరెంట్ టీచర్ డే ముఖ్య లక్ష్యం పిల్లల భవిష్యత్‌ను తీర్చిదిద్దడమే అన్నారు. పిల్లలకు తల్లిదండ్రులు ఇచ్చే అతిపెద్ద ఆస్తి చదువేని అన్నారు. మంచి చదువు కంటే పెద్ద ఆస్తి మరేమీ లేదని పేర్కొన్నారు. ఆర్థిక పరిస్థితి చదువుకు అడ్డంకి కాదన్నారు. పి4 మార్గదర్శి లాంటి ఎన్నో స్కీములు ఉన్నాయని చెప్పారు. ప్రభుత్వం చదువుకు ప్రోత్సాహం ఇస్తోందని అన్నారు. నాణ్యతతో కూడిన మధ్యాహ్న భోజనం, పుస్తకాలు, బూట్లు ఇస్తున్నామని వివరించారు. ఎమ్మెల్యే గొండు శంకర్ మాట్లాడుతూ మెరుగైన సమాజం కోసం ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు, విద్యార్థుల పాత్ర కీలకమని అన్నారు. అనంతరం కేంద్రమంత్రి పదో తరగతి గదిలో విద్యార్థులు, తల్లిదండ్రులను సంప్రదించి వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. గోపీచంద్, వారి తల్లి హైమావతి, ఉపాధ్యాయుడు తాళ్ల గిరిరాజుతో కలిసి ముచ్చటించారు. గోపీచంద్ అందజేసిన హోలిస్టిక్ ప్రోగ్రెస్ కార్డును పరిశీలిస్తూ అందులోని వివరాలు కోసం అడిగి తెలుసుకున్నారు. విద్యార్థి నేషనల్ మెరిట్ అండ్ మీన్స్ స్కాలర్‌షిప్ కింద రూ.12 వేలు వచ్చినట్లు తెలుసుకొని అభినందించారు. డిఇఒ తిరుమల చైతన్య లీప్ యాప్‌లో విద్యార్థి, ఉపాధ్యాయునికి సంబంధించిన అన్ని వివరాలు తెలుసుకోవచ్చని తెలియజేశారు. ప్రధానోపాధ్యాయులు పద్మావతి పాఠశాల ప్రగతిని వివరించారు.

అలాగే శ్రీకాకుళం ప్రభుత్వ మహిళా జూనియర్ కళాశాలలో నిర్వహించిన పేరెంట్ టీచర్ సమావేశంలో కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు, కలెక్టర్ స్వప్నిక్ దినకర్ పుండ్కర్, ఎమ్మెల్యే గొండు శంకర్ పాల్గొన్నారు.

పి-4 లక్ష్యసాధనకు కృషి

కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

ప్రజాశక్తి- శ్రీకాకుళం

జిల్లాలో పి-4 కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ అధికారులను ఆదేశించారు. గురువారం ప్రభుత్వ ముఖ్య కార్యదర్శి విజయానంద్ నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న అనంతరం మాట్లాడారు. ప్రభుత్వం వచ్చే ఆగస్టు 15 నాటికి 15 లక్షల కుటుంబాలను మార్గదర్శిలకు అనుసంధానం చేయాలని లక్ష్యంగా నిర్దేశించిందన్నారు. ఈ లక్ష్య సాధనకు ప్రతిఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.

జిల్లాలో బంగారు కుటుంబాలను మార్గదర్శిలతో అనుసంధానం చేసే ప్రక్రియ ఆశించిన స్థాయిలో ముందుకు సాగుతోందని పేర్కొన్నారు. ప్రతి నియోజకవర్గం నుంచీ కనీసం మూడు వేలు కుటుంబాలను మార్గదర్శిలకు అనుసంధానించాలని లక్ష్యంగా నిర్దేశించారు. గ్రామీణ ప్రాంతాల్లో సచివాలయ సిబ్బందిని భాగస్వామ్యం చేసి, వారి పరిధిలో జీవితంలో సుస్థిర స్థానంలో ఉన్న మార్గదర్శిలను గుర్తించాలని, ఇప్పటికే ఎంపిక చేసిన బంగారు కుటుంబాలను వారికి అనుసంధానం చేయడానికి కృషి చేయాలని ఆదేశించారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, అసిస్టెంట్ కలెక్టర్ దొనక పృథ్వీరాజ్ కుమార్ పాల్గొన్నారు.

సమీక్షిస్తున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

రోగులతో మాట్లాడుతున్న హరిబాబు

మానసిక ఆరోగ్య కేంద్రాలు మెరుగ్గా పనిచేయాలి

జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కె.హరిబాబు

ప్రజాశక్తి- శ్రీకాకుళం లీగల్

జిల్లాలో అధిక సంఖ్యలో నమోదవుతున్న మానసిక రోగుల ఆరోగ్య సమస్యల చికిత్సలపై వైద్యులు మరింత చొరవ చూపాలని జిల్లా న్యాయ సేవాధికారి సంస్థ కార్యదర్శి కె.హరిబాబు అన్నారు. జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ జునైద్ అహ్మద్ మౌలానా ఆదేశాల మేరకు స్థానిక ప్రభుత్వ జనరల్ (జిజిహెచ్), రాగోలు జెమ్స్ ఆస్పత్రులను గురువారం ఆకస్మికంగా సందర్శించారు. జిజిహెచ్‌లో మానసిక వ్యాధిగ్రస్తులతో స్వయంగా మాట్లాడి వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. మానసిక ఆరోగ్య చికిత్సలకు ప్రత్యేక శ్రద్ధ అవసరమని వైద్యులకు సూచించారు. సైకియాట్రిస్టుతో పాటు వైద్య సిబ్బందితో చర్చించి పౌష్టికాహార సరఫరా, చికిత్సా విధానాలపై సమీక్షించారు. రోగుల్లో ఆత్మస్థైర్యం, మానసిక స్థిరత్వం పెంపొందించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని హితవు పలికారు. అనంతరం ఆస్పత్రిలోని వన్‌స్టాఫ్ సెంటర్‌ను పరిశీలించారు. 18 ఏళ్లలోపు బాలికలు గర్భవతులుగా ఆస్పత్రి వచ్చినప్పుడు వాటిని గుర్తించడంలో మరింత జాగ్రత్తలు తీసుకోవాలని అధికారులకు సూచించారు. లింగ నిర్ధారణ నిషేధ చట్టానికి సంబంధించిన విషయాలనూ అధికారులకు వివరించి, వాటిని పకడ్బందీగా అమలు చేయాలని ఆదేశించారు. రాగోలు జెమ్స్‌ను పర్యటించి మానసిక రోగుల పరిస్థితిని స్వయంగా పరిశీలించారు. కార్యక్రమంలో డిఎంహెచ్ఒ అనిత, జెడ్ అడ్మిన్ బి.రాజశేఖర్‌రెడ్డి, ఇన్‌ఛార్జి సూపరింటెండెంట్ డి.పార్వతి, సైకియాట్రిస్టులు డి.వి.పద్మ, ఆర్.వి.ఆర్.అభినయ, డి.ప్రవీణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నారీశక్తిపై విస్తృత ప్రచారం

ప్రజాశక్తి- శ్రీకాకుళం సిటీ, రణస్థలం

జిల్లాలో అన్ని పాఠశాలలు, కలశాలల్లో నిర్వహించిన తల్లితండ్రులు, ఉపాధ్యాయుల ఆత్మీయ సమావేశాల కార్యక్రమాలు జిల్లాలో నిర్వహించారు. భాగంగా ఎస్పి కె.వి.మహేశ్వరారెడ్డి ఆదేశాలు మేరకు నారీశక్తి, సంకల్పం పేరిట జిల్లాలో వివిధ పోలీస్‌స్టేషన్లో పోలీసు అధికారులు తల్లిదండ్రులు, విద్యార్థులకు మహిళ భద్రతపై గురువారం విస్తృతంగా అవగాహన కల్పించారు. రణస్థలం మండలం పైడిభీమవరం డాక్టర్ రెడ్డీస్ లేబొరేటరీ కంపెనీలో నారీశక్తిపై శ్రీకాకుళం డిఎస్‌పి సిహెచ్.వివేకానంద అన్నారు. ఈ క్రమంలో మహిళల భద్రత, గుడ్ టచ్, బ్యాడ్ టచ్, మాదకద్రవ్యాల వల్ల జరిగే దుష్పరిణామాలు, సైబర్ నేరాలు, శక్తి యాప్‌పై అవగాహన కల్పించారు. మహిళ రక్షణకు గల చట్టాలు, గుడ్ టచ్-బ్యాడ్ టచ్, చైల్డ్ మ్యారేజ్‌లు వంటి అంశాలపై సోషల్ మీడియాలో డిజిటల్ అరెస్టు, అసభ్యకరమైన పోస్టులు, ఫొటో మార్ఫింగ్ వాటిపై అవగాహన కలిగి, అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. డయల్ 112, సైబర్ టోల్ ఫ్రీ నంబరు 1930, చైల్డ్ హెల్ప్‌లైన్ 1098, శక్తి యాప్ ద్వారా అందిస్తున్న సేవలు ఎస్ఒఎస్ బటన్ వంటి అత్యవసర నంబర్లపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండి ఆపద సమయంలో సద్వినియోగం చేసుకోవాలన్నారు. విద్యా సంస్థల పరిసరాల్లో గంజాయి, డ్రగ్స్, ఇతర మత్తు పదార్థాల అమ్మకం, రవాణా, వినియోగానికి సంబంధించిన సమాచారాన్ని 1972 టోల్ ఫ్రీ నంబరుకు, స్థానిక పోలీసులకు తెలియజేయాలన్నారు. అట్టివారు వివరాలు గోప్యంగా ఉంచుతామని అన్నారు.

శ్రీకాకుళం సిటీ: అవగాహన కల్పిస్తున్న మహిళా పోలీస్

గిరిజన గ్రామాలను అభివృద్ధి చేయాలి

ప్రజాశక్తి- మందస

ఆంధ్రా-ఒడిశా గిరిజన గ్రామాలను అభివృద్ధి చేయాలని ఆదివాసీ గిరిజన సంఘం మండల అధ్యక్ష, కార్యదర్శులు సవర గురునాథ్, సవర ఫాల్గుణరావు డిమాండ్ చేశారు. గిరిజన గ్రామాల సరిహద్దు సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ తహశీల్దార్ కార్యాలయం వద్ద గురువారం గిరిజనులు ధర్నా నిర్వహించారు. ధర్నాకు సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గోవిందరావు, రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.మోహనరావు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా గిరిజన సంఘం అధ్యక్ష కార్యదర్శులు మాట్లాడుతూ మండలంలోని సాబకోట, చీపి, బుడార్‌సింగి పంచాయతీ పరిధిలోని మాణిక్యపట్నం, మధ్యకళ్ల దాల్సరి, కొండమేర, గుడ్డికోల గ్రామాల్లో గిరిజనులు తరతరాలుగా స్థిరనివాసాలు ఏర్పాటు చేసుకొని జీవిస్తున్నామని వారన్నారు. గతంలో మాణిక్యపట్నం అంగన్వాడీ కేంద్రానికి ఒడిశా అధికారులు తాళం వేశారని దానిని ప్రశ్నించినందుకు గురునాథ అనే వ్యక్తిని అరెస్టు చేసి ఒడిశా ప్రభుత్వం జైల్లో నిర్బంధించిందని వారన్నారు. మాణిక్యపట్నంపై ఒడిశా ప్రభుత్వం వేసే రోడ్డు వల్ల పంట కాలవలు పాడైపోతే జిల్లా అధికారులు దృష్టికి తీసుకెళ్లిన ఫలితం లేకపోయిందని ఆఖరికి ఆ గ్రామాల రైతులు చందాలు వేసుకొని కాలువ నిర్మాణం చేసుకున్నారని వారన్నారు. మాణిక్యపట్నం, గుడ్డికోలా, మధ్య కళ్ల పూర్తిగా ఒడిశా గ్రామాలని అనేకసార్లు అధికారులు బెదిరిస్తున్నారు. దాల్సరిలో మన ప్రభుత్వం గిరిజనులకు పట్టాలి ఇచ్చిన భూములపై ఒడిశా ప్రభుత్వం ఫారెస్టు ఆఫీసు, కమ్యూనిటీ హాల్ నిర్మించుకొని ఆక్రమించుకున్నారు. కొండమేర గ్రామంలోని గిరిజనుల భూములను చెరువునూ ఆక్రమించుకున్నారు. ఈ విధంగా ఒడిశా ప్రభుత్వం, అధికారులు ఆంధ్రాలో ఉన్న గిరిజన భూములను ఆక్రమించుకుంటుంటే మన అధికారులు నిమ్మకనీరెత్తినట్లు ఉన్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆంధ్రా ప్రభుత్వం వేసిన రోడ్డుపై ఒడిశా ప్రభుత్వం రోడ్డు వేస్తూ మొత్తం ప్రాంతం ఒడిశా, ఆంధ్రాలో ఉన్నవారు ఖాళీ చేయాలని చెప్తున్నారని అన్నారు. ఈ గ్రామాల్లో ప్రభుత్వ అభివృద్ధి పథకాలు ఆగిపోతున్నాయని పేర్కొన్నారు.

మౌలిక వసతులు, కనీస సౌకర్యాలు కల్పించడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు వెంటనే జోక్యం చేసుకొని సమస్యలు పరిష్కరించాలని గిరిజనులు సాగుచేస్తున్న పోడు భూములకు పట్టాలు ఇవ్వాలని గిరిజనుల సాగులో ఉన్న భూములను ఆక్రమించుకుంటున్న గిరిజన యాత్రలపై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. అనంతరం తహశీల్దార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో జీడి రైతు సంఘం జిల్లా కన్వీనర్ తెప్పల అజయ్ కుమార్, సిఐటియు జిల్లా కార్యదర్శి ఎన్.గణపతి, ఆదివాసి గిరిజన సంఘం నాయకులు సవర కైలాస్, సవర తుంబేస్, సవర వాసు, రైతు సంఘం మండల కార్యదర్శి మట్ట ధర్మారావు, కేశవరావు, దుర్యోధన, కూర్మారావు తదితరులు పాల్గొన్నారు.

వినతిపత్రం అందజేస్తున్న గిరిజనులు

రూ.417 కోట్లతో పాఠశాల అభివృద్ధి పనులు

శశిభూషణరావు, ఎస్ఎస్ఎ ఎపిసి

- **25 మండలాల్లో కెజిబివి పాఠశాలలు**
- **ఏడువేల మంది విద్యార్థులు**
- **ఎస్ఎస్ఎ ఎపిసి శశిభూషణరావు**

లావేరు : జిల్లాలో రూ.417 కోట్లుతో ఎస్ఎస్ఎ ఫేజ్-2 నిధులతో 1054 పాఠశాలల అభివృద్ధి పనులు 2023లో మంజూరు కాగా, ఇప్పటికి రూ.253 కోట్లు ఖర్చు చేసినట్లు సమగ్ర శిక్ష ఎపిసి సంపతిరావు శశిభూషణరావు చెప్పారు. గురువారం మండలం మురపాక కెజిబివి పాఠశాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నిధులు పాఠశాల వసతిగృహాలు, ఆదనపు భవనాల నిర్మాణం, గ్రంథాలయాలు, కంప్యూటర్లు, ప్రహరీ గోడలు, మరుగుదొడ్లు నిర్మాణం వంటి అభివృద్ధి పనులకు చేపట్టినట్లు చెప్పారు. ఒక్కో పాఠశాలకు 280 సీట్లు 6 నుంచి ఇంటర్ వరకు కేటాయించినట్లు చెప్పారు. ఒక క్లాస్‌కి 40 మంది విద్యార్థులు చొప్పున ఉంటారన్నారు. ప్రైవేటు పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలు ఉండడంతో పాటుగా నాణ్యమైన విద్య, ఆహారం అందిస్తున్నామని, విద్యార్థులకు ఫలితాలు బాగా రావడంతో కెజిబివిల్లో సీట్లకు డిమాండ్ బాగా ఉందన్నారు. జిల్లా వ్యాప్తంగా కెజిబివిల్లో 7 వేల మంది చదువుతున్నారని, జిల్లాలోని సింగుపురం, లావేరు, ఎచ్చెర్ల, సంతబొమ్మాళి, కోటబొమ్మాళి, రణస్థలం, ఆమదాలవలస కెజిబివిల్లో సీట్లుకు విపరీతమైన డిమాండ్ ఉందన్నారు. అనంతరం పాఠశాలలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశంలో పాల్గొన్నారు. ఈయనతో పాఠశాల ప్రత్యేక అధికారి బల్ల సుధ, డిఇ ఉమామహేశ్వరి, ఎఇ గోరు జగదీష్ తదితరులున్నారు.

14న మెగా జాబ్‌మేళా

కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

శ్రీకాకుళం సిటీ: ఈ నెల 14న నిర్వహించనున్న మెగా జాబ్‌మేళాను నిరుద్యోగ యువతీ యువకులు సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఒక ప్రకటనలో సూచించారు. రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యాన శ్రీకాకుళం ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రాంగణంలో ఉదయం 9 గంటల నుంచి జాబ్‌మేళా నిర్వహిస్తున్నామని అన్నారు. ఈ మేళాలో దాదాపు పది ప్రైవేట్ కంపెనీలు పాల్గొంటారని తెలిపారు. ఈ జాబ్‌మేళాకు స్రీనిధి బిపిఒ, మేన్కైండ్ ఫార్మా, బంధన్ బ్యాంకు, తోషిబా, డైకిన్, డిమార్ట్ వంటి ప్రముఖ కంపెనీలు వస్తున్నాయని అన్నారు. వీటికి ఎస్ఎస్‌సి, ఇంటర్మీడియట్, ఐటిఐ, డిప్లొమా, డిగ్రీ, బిఫార్మసీ చదివిన 18 నుంచి 30 ఏళ్ల మధ్య వయసున్న నిరుద్యోగులు అర్హులని అన్నారు. అభ్యర్థులు తప్పనిసరిగా naipunyam.ap.gov.in వెబ్‌సైట్‌లో రిజిస్ట్రేషన్ చేసుకొని, రిఫరెన్స్ నంబర్, రెజ్యూమే, ఆధార్, విద్యార్హతల ఒరిజినల్స్, జెరాక్స్ కాపీలు, పాస్‌పోర్ట్ సైజు ఫోటోతో మేళా ప్రాంగణానికి రావాలని సూచించారు. మరిన్ని వివరాలకు 9704960160, 9550967353 సెల్ నంబర్లను సంప్రదించాలన్నారు.

IN THE HONOURABLE COURT OF THE ADDITIONAL SENIOR CIVIL JUDGE AT SRIKAKULAM.
FDP:183/2024 in OS: 298/2018

Between:
Suvvari Dileep kumar & Another .....Petitioners/plaintiffs
And:-
Gangi Lakshmi .....Respondent/Defendant

To,
Gangi Lakshmi, W/o Srinivasarao,
aged 53 years, Ammanagar,
Mettakkivalasa, Amadalavalasa Municipality,
Srikakulam district.

ఇందుమూలముగా మీకు తెలియజేయునది ఏమనగా, పై నంబరుగల FDP పిటిషన్‌లో మీకు నోటీసులు కోర్టు ద్వారా ఎన్నిసార్లు పంపినసూ తీసుకొనక కాలయాపన చేయుచున్నారు. కావున మీరు **తేదీ 23-07-2025 న ఉదయం: గం॥10-30 ని॥ లకు** పై కోర్టు వారి ఎదుట స్వయంగా కానీ, ప్లీడరు గారి ద్వారా కానీ హాజరు కాబడి మీ వాదనలు తెలియజేసుకొనవలెను. లేనిచో సదరు దావా మీ పరోక్షమునందు తీర్మానించబడునని తెలియ జేయడమైనది.

// పై కోర్టు ఉత్తర్వుల ప్రకారం //

కింతలి వెంకటరమణ
న్యాయవాది,
శ్రీకాకుళం, సెల్: 8328694453.

మహారాజశ్రీ సివిల్ జడ్జి సీనియర్ డివిజన్ సోంపేట వారి కోర్టులో
S.O.P. 01/2025

1. పొందరి యశోద.
2. పొందరి శ్రవణ్ కుమార్,
3. పొందరి శ్రావ్య. ....పిటీషనర్లు
మరియు : NIL ....రెస్పాండెంటు

పబ్లిక్ నోటీసు

పై నెంబరు పిటీషన్లో చనిపోయిన పి. జయరాం వురపు పొందరి జయరాం, S/o లేటు ముఖలింగం పోస్టు ఆఫీసు వీధి, సోంపేట గ్రామం, సోంపేట మండలం, శ్రీకాకుళం జిల్లా వారు **HMT** టౌన్ షిప్ సబ్ పోస్టు ఆఫీసు హైదరాబాదు నందు డిపాజిట్ చేసియున్న నగదు పొందగోరి పైన తెల్పిన పిటిషనర్లు పి. జయరాంకు వారసులుగా ధృవపత్రం పొందుటకు పైన తెలిపిన కోర్టు నందు పిటిషన్ దాఖలు చేసియున్నారు. పిటీషనర్లుకు వారసత్వపు ధృవపత్రం మంజూరు చేయడంలో ఎటువంటి అభ్యంతరాలు ఏవరికైనా ఉన్న యెడల **తే 18-07-2025 దీన ఉదయం 10-30 గంటలకు** పైన తెలిపిన కోర్టు నందు స్వయంగా గానీ లేదా వకీలు ద్వారా గానీ తెలియజేయవలెను. లేని పక్షమున ఏవరికి ఏటువంటి అభ్యంతరాలు లేవని శ్రీ కోర్టు వారు భావించి చట్ట ప్రకారం పిటీషనర్లుకు వారసత్వపు ధృవపత్రం (Succession Certificate) మంజూరు చేయబడునని ఈ పేపరు ప్రకటన మూలంగా తెలియజేయడమైనది.

(శ్రీ కోర్టువారి అనుమతితో)
బోడ్డ ధర్మారావు
న్యాయవాది & నోటరీ, సోంపేట.

వినతిపత్రం అందజేస్తున్న గెస్ట్ ఫ్యాకల్టీలు

సమస్యలపై గెస్ట్ ఫ్యాకల్టీల వినతి

ప్రజాశక్తి- ఎచ్చెర్ల

రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వ విద్యాలయంలో గురువారం కాంట్రాక్ట్ గెస్ట్ ఫ్యాకల్టీలు డా. రెడ్డి లక్ష్మనాయుడు, వై.నారాయణరావు, పి.నవీన్ ట్రిపుల్ ఐటి డైరెక్టర్ కెవిజిడి బాలాజీకి వినతిపత్రం అందజేశారు. 2018లో రాతపరీక్ష, ఇంటర్వ్యూ ద్వారా కాంట్రాక్ట్ నోటిఫికేషన్‌లో వచ్చిన గెస్ట్ ఫ్యాకల్టీ అని డిజిగ్నేషన్ ఇచ్చి అన్యాయం చేశారన్నారు. 2018కి ముందు, తర్వాత రిక్రూట్ అయిన వాళ్లందరికీ జీతాలు రూ.40 వేలు వరకు పెంచి తమకు మాత్రం రూ.25 వేలకే పరిమితం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. పలుమార్లు వినతిపత్రం సమర్పించినా ఇంత వరకు న్యాయం జరగలేదన్నారు. తమను కాంట్రాక్టు లెక్చరర్‌గా లేదా అసిస్టెంట్ ప్రొఫెసర్‌గా మార్చాలని కోరారు.

బాధ్యతలను స్వీకరిస్తున్న శ్రీనివాసరావు

డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌గా శ్రీనివాసరావు

ఇచ్ఛాపురం: ఇచ్ఛాపురం ప్రభుత్వ జూనియర్ కళాశాల ఇన్‌ఛార్జి ప్రిన్సిపాల్‌గా ఎకనామిక్స్ లెక్చరర్‌గా పనిచేస్తున్న కె.శ్రీనివాసరావు గురువారం బాధ్యతలను స్వీకరించారు. డాక్టర్ రబిన్ కుమార్‌పాడి ఇటీవల ప్రిన్సిపాల్‌గా ఉద్యోగం విరమణ చేశారు. కమిషనర్ నారాయణ భరత్ గుప్తా ఆదేశాలు మేరకు ఇన్‌ఛార్జి ప్రిన్సిపాల్‌గా శ్రీనివాసరావును నియమించారు. కళాశాల అభివృద్ధికి తన వంతు సహకారం అందిస్తానని అన్నారు. విద్యార్థులకు అన్ని వేళల అందుబాటులో ఉంటానని పేర్కొన్నారు. విద్యార్థుల భవిష్యత్‌ను చక్కదిద్దేందుకు కృషి చేస్తానని తెలిపారు. అధ్యాపకులు దుర్యోధన శివకుమార్, సీతమ్మ, నాగేశ్వరరావు, సంతోష కుమార్, బృందావనం, రాధావరప్రసాద్, రాజేంద్ర త్రిపాఠి, మోహనరావు, లోకేష్, ఈశ్వరరావు అభినందనలు తెలిపారు.

ఉపాధ్యాయుడు ఆదర్శం

టెక్కలి: ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేస్తూ ప్రభుత్వ పాఠశాలలపై నమ్మకాన్ని కల్పించే క్రమంలో ప్రభుత్వ ఉపాధ్యాయులుగా విధులు నిర్వర్తిస్తున్న ఎన్ని షణ్ముఖరావు తాను విధులు నిర్వర్తిస్తున్న పాఠశాలలోనే తన ఇద్దరు పిల్లలను జాయిన్ చేసి సహచర ఉపాధ్యాయులు ఆదర్శంగా నిలిచారు. మండలంలోని నరసింగపల్లికి చెందిన షణ్ముఖరావు తన ఇద్దరు కుమార్తెలైన ఎన్ని మనస్విని ఐదో తరగతిలోనూ, ఎన్ని జాన్విత‌ని ఒకటో తరగతిలో జాయిన్ చేశారు. తాను ప్రభుత్వ ఉపాధ్యాయుడు కావడంతో సమీపంలోని రాంపురం ప్రాథమిక పాఠశాలలో ఆయన విధులు నిర్వర్తిస్తుండడంతో తన ఇద్దరు పిల్లలను అక్కడే చేర్పించి తోటి ఉపాధ్యాయులకు ఆదర్శంగా నిలిచారు. ప్రభుత్వ ఉపాధ్యాయుడు షణ్ముఖరావు చొరవని గ్రామస్తులు ఉపాధ్యాయులు అభినందించారు. ప్రతిఒక్క ఉపాధ్యాయుడూ ఇదేవిధంగా కృషి చేస్తే ప్రభుత్వ పాఠశాలలో బలపడతాయని పలువురు అభిప్రాయపడ్డారు.

ముమ్మరంగా వాహనాల తనిఖీ

కవిటి: కవిటి పోలీస్‌స్టేషన్ పరిధిలో ముమ్మరంగా వాహనాల తనిఖీలు నిర్వహిస్తున్నట్టు ఎస్‌ఐ రవివర్మ తెలిపారు. కవిటి బస్టాండ్ పరిధిలో గురువారం వాహనాలను తనిఖీలు నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపినా, వాహనానికి సంబంధించిన పత్రాలు లేకపోయినా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ముఖ్యంగా వాహనాలు నడిపే మైనర్లపై కఠిన చర్యలు తీసుకుంటామని, అదే సమయంలో హెల్మెట్ లేకుండా వాహనం నడిపితే ం జరిమానా చెల్లించాల్సిందేనని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా సరైన పత్రాలు లేని పలు వాహనాలపై కేసులను నమోదు చేశారు.

నారాయణవలస సంత వేలం వాయిదా

కోటబొమ్మాళి: మండలంలోని నారాయణవలస గురువారం వారపు సంత పాటదారులు హాజరు కాకపోవడంతో వాయిదా పడినట్లు ఎంపిడిఒ కె.ఫణీంద్రకుమార్ తెలిపారు. ఉదయం 10 గంటలకు నిర్వహించినట్లు ప్రకటించినా సాయంత్రం 5 వరకు ఎవరూ పాటదారులు హాజరు కాకపోవడంతో వేలం పాట వాయిదా వేశామన్నారు. తిరిగి 14న ఉదయం 10 గంటలకు నిర్వహించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఇఒపిఆర్‌డి జె.ఆనందరావు, సీనియర్ అసిస్టెంట్ కె.వి.ఆర్.మూర్తి, కార్యదర్శి పి.రనిష. జూనియర్ అసిస్టెంట్ కె.రామకృష్ణ పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఆర్థికసాయం

వజ్రపుకొత్తూరు: 1989-90 పూర్వ విద్యార్థులు అనారోగ్యంతో బాధపడుతున్న తమ స్నేహితునికి గురువారం ఆర్థికసాయం అందజేశారు. ఆమదాలవలసలో నివాసం ఉంటున్న కూటికుప్పల శ్రీనివాసరావును కలిసి రూ.70 వేలు ఆర్థికసాయం అందించారు. ఆరోగ్య పరిస్థితి తెలుసుకుని సానుభూతి తెలియజేస్తూ ధైర్యం చెప్పారు. కార్యక్రమంలో మద్దిల హరినారాయణ, బొడ్డేపల్లి మోహనరావు, కీలు లోకనాథం, పేరాడ రమేష్, పి.అప్పలస్వామి, కంచరాన భాస్కర్, జామి మధు, సానా గణేష్, లాభాల సరిత, ద్రౌపది, శకుంతల పాల్గొన్నారు.

మున్సిపల్ రాజుకు సన్మానం

ఆమదాలవలస: పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో ఉద్యోగం చేస్తూ పట్టణంలో మున్సిపల్ రాజుగా ప్రత్యేక గుర్తింపు పొందిన పివికె రాజును మున్సిపల్ ఉద్యోగులు ఘనంగా సన్మానించారు. మున్సిపల్ కార్యాలయంలో విధులు నిర్వహిస్తూ మాజీ ఎమ్మెల్యే బొడ్డేపల్లి సత్యవతి వద్ద 10 సంవత్సరాలు ప్రభుత్వ విప్ కూన రవికుమార్ వద్ద, ఐదు సంవత్సరాలు ప్రస్తుతం మళ్లీ ఎమ్మెల్యే రవికుమార్ వద్ద వ్యక్తిగత సహాయకుడిగా (పిఎ)గా ఈయన బాధ్యతలు నిర్వహించారు. అలాగే మున్సిపల్ కార్యాలయంలో కూడా వివాదరహితుడిగా గత కొన్నేళ్ల నుంచి ఉద్యోగ బాధ్యతలు నిర్వహించిన రాజు ఇటీవల పదవి విరమణ పొందారు. గురు పౌర్ణమి సందర్భంగా మున్సిపల్ కార్యాలయానికి మున్సిపల్ ఉద్యోగులు ఆయనను ప్రత్యేకంగా ఆహ్వానించి ఘనంగా సన్మానించినందుకు రాజు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలతో నిత్యం పౌరసంబంధాల సేవలు అందించాల్సిన మున్సిపల్ ఉద్యోగులు విధి నిర్వహణలో బాధ్యతగా ఉంటూ ప్రజల మన్ననలు పొందాలన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ ఎఇ జాన్సన్, స్వయం సహాయక సంఘాల సిఒ నాగమణి, మున్సిపల్ ఉద్యోగులు ఎ.వి.శ్రీను, పెంటయ్య, ఉమ తదితరులు పాల్గొన్నారు.

యంత్రాలతో సాగు మేలు

రణస్థలం : వర్షాభావ పరిస్థితుల వల్ల ఖరీఫ్ సీజన్‌లో వరినాట్లు ఆలస్యం అవుతున్న ప్రాంతాల్లో రైతులు విత్తనం, ఎరువు ఒకేసారి వేసే సీడ్‌డ్రిల్ యంత్రంతో నేరుగా వరిసాగు చేయడం లాభదాయకమని డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ సీనియర్ ఏరియా మేనేజర్ పి.తవిటినాయుడు అన్నారు. గురువారం మండలంలో వెంకటేశ్వర కాలనీలో క్షేత్రస్థాయిలో పరిశీలించారు. సాంప్రదాయ పద్ధతితో పోల్చితే రైతులు ఆరుతడి పంటలు యంత్రంతో సాగు పద్ధతి అవలంబించడం వలన నారుమడి తయారీ, పొలం దమ్ము చేసి నాట్లువేసే పని ఉండదన్నారు. సుమారు రూ.6 వేలు ఖర్చు ఆదా చేసుకోవచ్చన్నారు. జిల్లాలో 16 మండలాల రైతులకు తమ రెడ్డీస్ ఫౌండేషన్ ద్వారా తక్కువ సాగుఖర్చుతో మేలైన దిగుబడులు సాధించే వ్యవసాయ పద్ధతులను పరిచయం చేస్తూ ఆర్థికంగా అభివృద్ధి చేయడానికి నిరంతరం కృషి చేస్తున్నామన్నారు. దీనికోసం ఈ ఏడాది జిల్లాలో 75 యంత్రాలను రైతులకు అందుబాలులో ఉంచామన్నారు. కార్యక్రమంలో డాక్టర్ రెడ్డీస్ ఫౌండేషన్ సమన్వయకర్త ఎస్‌పి నారాయణరావు, సిహెచ్ ప్రసాద్, రైతు మిత్రలు పాల్గొన్నారు.

సందడిగా 'మెగా' సమావేశం

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

విద్యార్థుల భవిష్యత్‌ను ఉన్నతంగా తీర్చిదిద్దడానికి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు కలిసి ఆలోచించి, ఉమ్మడి కృషి చేయాలని ప్రభుత్వ విప్ బెందాళం అశోక్ పిలుపునిచ్చారు. చదువుల పండగలో భాగంగా అందరూ భాగస్వాములు కావాలని కోరారు. ఇచ్ఛాపురం మున్సిపాలిటీ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించిన ఈ మెగా సమావేశంలో పాల్గొన్నారు. విద్యార్థుల సర్వతోము ఖాభివృద్ధికి ఉపాధ్యాయులు, తల్లిదండ్రుల మధ్య సమన్వ యం ఎంత అవసరమో వివరించారు. పురు షోత్త పురం అర్బన్ హెల్త్ సెంటర్ వైద్యులు జోహితా అధ్యక్షతన అన్ని ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో వైద్య శిబిరాలు నిర్వహించారు.

నరసన్నపేట : నరసన్నపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించిన పేరెంట్స్ మీటింగ్‌లో ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి, నియోజకవర్గ సమన్వయకర్త బగ్గు అర్చన, తహశీల్దార్, ఎంపిడిఒ, ప్రిన్సిపాల్ పాల్గొన్నారు.

కొత్తూరు/హిరమండలం : కొత్తూరు మండలం బలద ప్రభుత్వ ఉన్నత, హిరమండలం మండలం ఎం.అవలంగి జిల్లా పరిషత్ పాఠశాలల్లో నిర్వహించిన పేరెంట్స్ సమావేశంలో ఎమ్మెల్యే మామిడి గోవిందరావు, జెడ్‌పిటిసి బుచ్చిబాబు, ఎంఇఒ కె.రాంబాబు, మండల ప్రత్యేక ఆహ్వానితులు, విద్యా వేత్త తిరుపతిరావు పాల్గొన్నారు. అంతకుముందు సర్వేపల్లి రాధాకృష్ణ విగ్రహానికి పూలమాలవేసి నివాళ్లర్పించి విద్యార్థి మిత్ర కిట్లు అంజేశారు.

ఎచ్చెర్ల: మండల పరిధిలో గల గురుకుల పాఠశాలలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమావేశంలో జెసి పర్మాన్ అహ్మద్ ఖాన్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా తల్లిదండ్రులతో మాట్లాడుతూ విద్యార్థులు ఉన్నత శిఖరాలకు ఎదగాలని సూచిస్తూ పిల్లలకు తల్లిదండ్రులు తగిన ప్రోత్సాహాన్ని అందించాలని సూచించారు. ఎచ్చెర్ల పరిధిలో గల సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో అందించే సౌకర్యాలను వివరించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల హెచ్‌ఎం పద్మజ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పొందూరు: తల్లిదండ్రులు తమ పిల్లల భవిష్యత్‌ను ఎలా తీర్చిదిద్దాలో.. వారి భవిష్యత్ లక్ష్యాల సాధనకు ఉపయోగపడేందుకు మెగా పేరెంట్స్ టీచర్ సమావేశం ఎంతో ఉపయోగపడుతుందని ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. మండలం తండ్యాం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన మెగా పేరెంట్స్, టీచర్స్ మీటింగ్‌లో ఆయన పాల్గొన్నారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. నియోజకవర్గ ప్రత్యేకా ధికారి ఎం.అప్పారావు, ఎంపిడిఒ మన్మథరావు, తహశీల్దార్ వెంకటేష్ రామానుజులు, ఎంఇఒలు శ్రీరాములు, రాజా రావు, ఉపాధ్యాయులు, సిబ్బంది, స్థానిక నాయకులు పాల్గొన్నారు.

లావేరు: మండలంలోని మురపాక కెజిబివి పాఠశాలలో ఏర్పాటు చేసిన మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్‌లో ఎమ్మెల్యే ఎన్.ఈశ్వరరావు పాల్గొన్నారు. ముందుగా రూ.2.3 కోట్లుతో పాఠశాల అదనపు వసతి గృహం భవనాల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో సమగ్రశిక్ష ఎపిసి సంపతిరావు శశిభూషనరావు, టిడిపి మండల అధ్యక్షుడు ముప్పిడి సురేష్, పిన్నింటి మధుబాబు, కెజిబివి ప్రత్యేక అధికారి బల్ల సుధ, తహశీల్దార్ శ్రీనువాసరావు, ఎంపిడిఒ వెంకటరాజు, ఎంఇఒ మురళీకృష్ణ, డిసిఎంఎస్ చైర్మన్ చౌదరి అవినాష్, నాయకులు అప్పలనాయుడు, జనార్దన్, శ్యామల రావు, ఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

రణస్థలం రూరల్: మండలంలోని పైడిభీమవరం జిల్లా పరిషత్ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన మెగా పేరెంట్స్, టీచర్స్ సమావేశానికి విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, ఎమ్మెల్యే ఎన్.ఈశ్వరరావు పాల్గొన్నారు. కార్యక్రమంలో డిసిఎంఎస్ చైర్మన్ చౌదరి అవినాష్, నాయకులు లెంక శ్యామలరావు, సర్పంచ్ సింక భవాని, రౌతు శ్రీనివాసరావు, వడ్డాది శ్రీనివాసరావు, జగన్నాధం నాయుడు, వెంకట భానోజీ నాయుడు, ఎం.కనకరావు, హెచ్‌ఎం శోభారాణి, ఎంపిడిఒ ఈశ్వరరావు, తహశీల్దార్ సనపల కిరణ్ కుమార్, ఎంఇఒ అజ్జాడ త్రినాథరావు, సెక్రటరీ అజయ్ బాబు తదితరులు పాల్గొన్నారు.

మందస : మండలంలోని ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలల్లో నిర్వహించిన పేరెంట్స్ సమావేశాల్లో ఎంపిడిఒ వెంకట రమణ, ఎపిఎం కూర్మారావు, ఎపిఒ హరికృష్ణ పాల్గొన్నారు.

పలాస : పలాస ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ప్రినిపాల్ పి.రవికుమార్ అధ్యక్షతన నిర్వహించిన పేరెంట్స్ సమావేశంలో ఆర్‌డిఒ జి.వెంకటేష్, ఎపిటి ట్రేడ్ ప్రమోషన్ కార్పొరేషన్ చైర్మన్ వజ్జ బాబూరావు, మున్సిపల్ చైర్మన్ గిరిబాబు, తహశీల్దార్ టి.కళ్యాణ చక్రవర్తి, ఎంపిడిఒ వసంత కుమార్, ఎంఇఒ సిహెచ్.శ్రీనివాసరావు, ఎఎంసి చైర్మన్ మల్లా శ్రీనివాసరావు పాల్గొన్నారు. జూనియర్ కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఎంఇఒ-2 చెరుకుపల్లి సత్యం, ప్రిన్సిపాల్ కె,నర్సింహమూర్తి, కాశీబుగ్గ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన సమావేశంలో టిడిపి జిల్లా ప్రధాన కార్యదర్శి పి.విఠల్‌రావు, హెచ్‌ఎం చిన్నంనాయుడు పాల్గొన్నారు.

టెక్కలి : టెక్కలి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన పేరెంట్స్ సమావేవంలో టిడిపి మండల అధ్యక్షులు బగాది శేషగిరి, ఎంఇఒ బి.అప్పలస్వామి, హెచ్‌ఎం డి.నాగభూష ణం, అలాగే జూనియర్ కళాశాల ఆవరణలో ప్రిన్సిపాల్ తిరుపతిరావు, డాక్టర్ మహారాజు, అధ్యాపకులు పాల్గొన్నారు.

సోంపేట : సంస్కార భారతి జూనియర్ కాలేజీలో నిర్వహించిన పేరెంట్స్ సమావేశంలో చైర్మన్ వై.దేవరాజు, సెక్రెటరీ కరస్పాండెంట్ డాక్టర్ నిమ్మాన దాసు, ప్రిన్సిపాల్లు బి.కవిబాబు, బి.శ్రీరామ్మూర్తి, ఎఒ పాపారావు పాల్గొన్నారు.

నందిగాం : మండలంలోని ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలల్లో నిర్వహించిన పేరెంట్స్ సమావేశంలో టిడిపి మండల నాయకులు పి.అజయ్‌కుమార్, బాలయోగి గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ కె.మంజుల పాల్గొన్నారు. ప్రభుత్వ జూనియర్ కాలేజీ, తామరపల్లి ఉన్నత పాఠశాలలో పదో తరగతిలో 550 మార్కులకు పైబడిన వారికి నగదు బహుమతులు అందించారు

వజ్రపుకొత్తూరు : మండలంలోని పూండి గోవిందపురం ప్రభుత్వ జూనియర్ కళాశాలలో నిర్వహించిన పేరెంట్స్ సమావేశం అగ్నికుల క్షత్రియ డైరెక్టర్ పుచ్చ ఈశ్వరావు, ప్రిన్సిపాల్ కె.రమేష్ పట్నాయక్, ప్రధానోపాధ్యాయులు హరిబాబు, టిడిపి మండల ప్రధాన కార్యదర్శి కర్ణి రమణ పాల్గొన్నారు. అలాగే కంబలరాయుడపేట ప్రాథమిక పాఠశాలలో నిర్వహించిన సమావేశంలో ఎంఇఒ 2 వెంకటరమణ, ప్రధానోపాధ్యాయులు లఖినాన కరుణాకర్, సర్పంచ్ వంక చిరంజీవి పాల్గొన్నారు.

కవిటి : మండలంలోని ప్రభుత్వ, ప్రయివేటు పాఠశాలల్లో నిర్వహించిన పేరెంట్స్ సమావేశంలో నాయకులు పూడి లక్ష్మణరావు, ఆరింగి మధు, బెందాళం రమేష్, తహశీల్దార్ మురళీమోహన్, ఎంపిడిఒ త్రినాథ్, ఎంఇఒ ధనుంజయ మజ్జి, ఎస్‌ఐ రవివర్మ పాల్గొన్నారు.

మెళియాపుట్టి : మండలంలోని పెద్దలక్ష్మీపురం, కోసమాల, చాపర, కరజాడ, గొప్పిలి, జాడుపల్లి తదితర పాఠశాలల్లో నిర్వహించిన పేరెంట్స్ సమావేశంలో పిఎసిఎస్ అధ్యక్షులు సలాన మోహనరావు, ఎంపిడిఒ నరసింహప్రసాద్ పండా, ఎంఇఒలు ఎస్.దేవేందరరావు, ఎం.పద్మనారావు, ప్రధానోపాధ్యాయులు మహాలక్ష్మి, తిరుమలరావు పాల్గొన్నారు.

సోంపేట : టిడిపి మండల అధ్యక్షుడు మడ్డు కుమార్ అధ్యక్షలన పట్టణంలో సుపరిపాలనలో తొలి అడుగు కార్యక్రమం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి సంవత్సర కాలంలో కూటమి ప్రభుత్వం చేపట్టిన సంక్షేమ, అభివృద్ధి పోస్టర్ల ద్వారా వివరించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు సూరాడ చంద్రమోహన్, చిత్రాడ శ్రీను, చిత్రాడ శేఖర్, బీన ఆనందరావు, బీన ఈశ్వరరావు, పొందూరు రాజు, రెల్ల నారాయణ, మడ్డు రాజారావు, అనింగి బాబూరావు, దుర్ధి చిరంజీవిలు పాల్గొన్నారు.

ఇచ్ఛాపురం : మాట్లాడుతున్న విప్ అశోక్

కోటబొమ్మాళి: మండలంలోని యలమంచిలి ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించిన పేరెంట్స్ మీటింగ్‌లో ఆర్‌డిఒ ఎం.కృష్ణమూర్తి, తహశీల్దార్ ఆర్.అప్పలరాజు, ఎంపిడిఒ కె.ఫణీంద్రకుమార్, స్థానిక జిల్లా పరిషత్ ప్రభుత్వ పాఠశాలలో నిర్వహించిన సమావేశంలో టిడిపి రాష్ట్ర కార్యదర్శి బోయిన గోవిందరాజులు, టిడిపి మండల అధ్యక్షులు బోయిన రమేష్ పాల్గొన్నారు.

ఆమదాలవలస: పట్టణంలోని మెట్టక్కివలసలో నున్న మున్సిపల్ హైస్కూల్‌లో తల్లిదండ్రుల ఆత్మీయ సమావేశానికి జనసేన నియోజకవర్గ ఇన్‌ఛార్జి పేడాడ రామ్మోహనరావు హాజరయ్యారు. ఉపాధ్యాయులు, విద్యార్థులతో కలిసి మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ చైర్మన్ దూసి సీతారాం, టిడిపి నాయకులు నాగళ్ల మురళీధర్ యాదవ్, లంక నాగరాజు, గురుగుబెల్లి మురళీ, నరేష్, రాడ విజయ్, చిరంజీవి, విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. పట్టణంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ తమ్మినేని గీత మొక్కలు నాటారు. శ్రీ వాణీ విద్యా నికేతన్‌లో మాజీ మున్సిపల్ కమిషనర్ జీవరత్నం పాల్గొన్నారు.

శ్రీకాకుళం సిటీ: నగరంలో గురువారం సందడిగా ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, జూనియర్ కళాశాలల్లో మెగా పేరెంట్ సమావేశాలు నిర్వహించారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాల, అరసవల్లి పాఠశాల, ఎన్‌టిఆర్ ఉన్నత పాఠశాల, ప్రైవేట్ పాఠశాలలు సెయింట్ జోషఫ్, న్యూ సెంట్రల్, శ్రీ చైతన్య, భాష్యం తదితర పాఠశాలల్లో సమావేశాలు నిర్వహించి, సహపక్తి భోజనాలు ఏర్పాటు చేశారు. విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

ఎంఇఒలను నిలదీసిన తల్లిదండ్రులు

బూర్జ: మండలంలో అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో, ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో పేరెంట్స్, టీచర్స్ సమావేశం నిర్వహించారు. ఆయా పాఠశాలల్లో విధివిధానాలు తల్లిదండ్రులకు వివరించారు. అలాగే అల్లెన ప్రభుత్వ పాఠశాలలో ఎంఇఒలు ధనుంజయరావు, సింహాచలంను తల్లిదండ్రులు నిలదీశారు. ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్న మా పిల్లల పరిస్థితి ఏమిటో తెలియజేయాలని, ఇక్కడి నుంచి పాలవలస గ్రామానికి పిల్లలు చదువుకోడానికి వెళ్లలేరని తల్లిదండ్రులు తెలిపారు. కార్యక్రమంలో ఎంపిడిఒ తిరుపతిరావు, ఇఒపిఆర్‌డి విజయలక్ష్మి, తహశీల్దార్ వై.వి.పద్మావతి, మాజీ ఎమ్మెల్సీ పీరుటక్ల విశ్వ ప్రసాదరావు, మార్కెఫెడ్ డైరెక్టర్ రామకృష్ణ నాయుడు, ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సుస్మిత, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

విద్యాశాఖ అధికారులను నిలదీస్తున్న అల్లెన గ్రామస్తులు

మెగా పేరెంట్స్, టీచర్స్ సమావేశానికి సమాచారం లేదు

రణస్థలం: మండలంలోని లంకపేట హైస్కూల్‌లో చదువుతున్న పిల్లల తల్లిదండ్రులకు మెగా పేరెంట్స్, టీచర్ మీటింగ్‌కి సమాచారం ఇవ్వలేదని లంకపేట హైస్కూల్‌లో చదవుతున్న విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపించారు. ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహించిన మెగా పేరెంట్స్, టీచర్ మీటింగ్‌కి పిల్లల తల్లిదండ్రులకు కనీసం సమాచారం ఇవ్వకపోవడం బాధాకరమన్నారు. గ్రామానికి చెందిన ప్రజాప్రతినిధులు, ఉద్యోగులు, పరిశ్రమ ఎంప్లాయిస్, గ్రామపెద్దలకు చెందిన పిల్లలు రణస్థలం, శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం ప్రాంతాల్లో కార్పొరేట్ పాఠశాలల్లో చదువు తున్నారని, హైస్కూల్ ఉపాధ్యాయులు వారందరి మెప్పుకోసం వారిని పిలిచి మెగా పేరెంట్స్, టీచర్ మీటింగ్‌కి సమాచారం ఇచ్చారుగాని, హైస్కూల్‌లో చదువుతున్న విద్యార్థుల తల్లిదండ్రులకు మాత్రం సమాచారం ఇవ్వడంలో శ్రద్ధ చూపలేదని మండిపడ్డారు. జిల్లా అధికారులు స్పందించి ఇటువంటి సంఘటనలు పునరావృతం కాకుండా ఉపాధ్యాయులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ విషయంపై పిల్లల తల్లిదండ్రులంతా కలిసి శ్రీకాకుళం డిఇఒ కార్యాలయానికి వచ్చి ధర్నా చేస్తామని హెచ్చరించారు.

డ్రోన్ కెమెరాలతో తనిఖీలు

ప్రజాశక్తి- ఆమదాలవలస

ఎస్‌పి కె.వి మహేశ్వర్ రెడ్డి ఆదేశాల మేరకు డ్రోన్ కెమెరాలతో విస్తృత తనిఖీలు చేపట్టినట్లు ఎస్‌ఐ ఎస్.బాలరాజు తెలిపారు. గురువారం పట్టణ పరిధిలోని పలు నేర ప్రాంతాల్లో ఈ తనిఖీలు నిర్వహించారు. డిఎస్‌పి వివేకానంద్, సర్కిల్ ఇన్‌స్పెక్టర్ పి.సత్యనారాయణ ఆధ్వర్యంలో సుమారు 20 ప్రాంతాల్లో డ్రోన్ కెమెరాలతో నిఘా పెంచడం జరిగిందన్నారు. పలు ప్రాంతాల్లో కొంతమంది వ్యక్తులు అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడుతున్నట్లు గుర్తించామని, అటువంటి వారిపై ఈ డ్రోన్ కెమెరాలతో ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. అసాంఘిక కార్యకలాపాలు, గంజాయి, మాదక ద్రవ్యాలు, పేకాట స్థావరాలకు దూరంగా ఉండాలని, నేరచరిత్ర కలిగిన కొంతమంది వ్యక్తుల ప్రోద్బలంతో అటువంటి కార్యక్రమాలకు పూనుకొని యువకులు జీవితాలను నాశనం చేసుకోవద్దని ఎస్‌ఐ బాలరాజు తెలిపారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు.

కేసుల రాజీకి సహకరించాలి

ప్రజాశక్తి- టెక్కలి

కోర్టులో పెండింగ్‌లో ఉన్న కేసుల్లో ఇరు పార్టీలకు మధ్యవర్తిత్వం వల్ల కలిగే ప్రయోజనాలను వివరించి రాజీకి న్యాయవాదులు సహకరించాలని టెక్కలి సీనియర్ సివిల్ జడ్జి బి.నిర్మల అన్నారు. కోర్టుల సముదాయంలో న్యాయవాదులతో గురువారం మాట్లాడి అవగాహన కల్పించారు. మధ్యవర్తుల సహాయం ద్వారా కేసుల పరిష్కారానికి త్వరలో చూపాలని కోరారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు పినకన అజయ్‌కుమార్, న్యాయవాదులు పాల్గొన్నారు.

కలశ యాత్రకు ఘన స్వాగతం

ప్రజాశక్తి- ఇచ్ఛాపురం

అఖిల భారత యాదవ మహాసభ ఆధ్వర్యాన నిర్వహిస్తున్న రెజంగ్లా పవిత్ర కలశ యాత్రకు గురువారం స్థానిక ఎ.ఎస్.పేటలో యాదవలు గురువారం ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా అఖిల భారత యాదవ మహాసభ రాష్ట్ర అధ్యక్షులు ఎస్.మహేశ్వరి యాదవ్ మాట్లాడుతూ అహిర్ రెజ్మెంట్ తిరిగి పున:ప్రారంభించాలని, అందుకు దేశం మొత్తం లక్ష కిలోమీటర్లు కలశ యాత్ర చేపట్టామని అన్నారు. కార్యక్రమంలో సెక్రెటరీ జనరల్ ఆంజనేయమూర్తి యాదవ్, ప్రోగ్రామ్ కన్వీనర్ బి.దత్తాత్రేయ యాదవ్, మహిళా అధ్యక్షులు నాగ మల్లేశ్వరి, నియోజకవర్గ కన్వీనర్ కోట రామారావు, సాలిన ఢిల్లీ యాదవ్, పత్రి తవిటయ్య, బోరుభద్ర లోహిదాస్, బొండడా మహేష్, కురయ్య తదితరులు పాల్గొన్నారు.

అధికారుల పర్యవేక్షణలో రోడ్డు పనులు

ప్రజాశక్తి- బూర్జ

మండలంలోని డొంకల పర్త పంచాయతీ పరిధి వై.పర్తలో గురువారం అధికారుల పర్యవేక్షణలో రహదారి పనులను చేపట్టారు. వై.పర్త గ్రామంలో రూ.9 లక్షల 50 వేలు పంచాయతీరాజ్ నిధులతో రహదారులు, డ్రెయినేజీల నిర్మాణం చేపట్టారు. అయితే అదే గ్రామానికి చెందిన కొంతమంది వ్యక్తులు తమకు చెందిన జిరాయితీ భూముల్లో రహదారి, కాలువల నిర్మాణ పనులు చేపట్టారని, వాటిని నిలుపుదల చేసి తమకు న్యాయం చేయాలని జిల్లా కలెక్టర్ గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు మేరకు స్థానిక తహశీల్దార్ వై.వి.పద్మావతి సమాచారం మేరకు ఎస్‌ఐ ప్రవల్లిక, హెచ్‌సి, విఆర్‌ఒ శ్రీనివాసరావు, సర్వేయర్ ఎస్.రాంబాబు, ఇంజనీరింగ్ అసిస్టెంట్ సత్యప్రసాద్‌లు గురువారం గ్రామానికి చేరుకున్నారు. ఏవైనా సమస్యలుంటే పరిష్కారం చేపట్టేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. అయితే గ్రీవెన్స్ సెల్‌లో ఫిర్యాదు చేసిన అర్జీదారులు ఎవరూ రాకపోవడంతో అధికారుల పర్యవేక్షణలో పనులను చేపట్టారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ సమస్యలుంటే పరిష్కారం జరిపి పనులు చేపట్టేందుకు చర్యలు తీసుకుంటామన్నారు.ఎవరూ ముందుకు రాకపోవడంతో యధావిధిగా పనులు చేపట్టడం జరిగిందని తెలిపారు.

అధికారుల పర్యవేక్షణలో చేపడుతున్న అభివృద్ధి పనులు

కవిటి : సన్మానిస్తున్న పూర్వ విద్యార్థులు

గురువే మార్గదర్శి

ప్రజాశక్తి- కవిటి

తల్లిదండ్రుల తరువాత అంతటి స్థానం కలిగిన గురువే నేటి సమాజానికి మార్గదర్శి అని వక్తలు అన్నారు. మండలంలోని కపాసుకుద్దిలో గురుపౌర్ణమి సందర్భంగా 1982-83 విద్యా సంవత్సరానికి చెందిన 5వ తరగతి పూర్వ విద్యార్థులు తమకు అప్పట్లో విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయుడు బందరు ఉమామహేశ్వరరావును ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా తమ చిన్ననాటి విద్యా జ్ఞాపకాలను మళ్లీ మనసులోకి తెచ్చుకున్న వారు గురువుకి పాదాభివందనం చేశారు. అనంతరం పూర్వ విద్యార్థులైన పులకల శ్రీరాములు, నిరంజన్‌రావు, కీలు కేశవరావు, షణ్ముఖరావు, లక్ష్మీనారాయణ, పాపారావు, ఈశ్వరరావు, తెప్పల కృష్ణారావు, ప్రియా ఆనందరావు, అత్తి రామారావు, శంకరరావు కృతజ్ఞతాభావాన్ని వ్యక్తం చేశారు. సర్పంచ్ కాయ దమయంతి, ఎంపిటిసి తడక పార్వతి, గ్రామపెద్ద తోట ధర్మరాజు, కీలు చంద్రశేఖరం పాల్గొన్నారు.

పలాస : స్థానిక శివాజీ నగర్‌లో సాయిబాబా మందిరంలో గురు పౌర్ణమి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్, సాయిబాబా ఆలయ ధర్మకర్త, పిఎసిఎస్ మాజీ అధ్యక్షుడు దువ్వాడ శ్రీధర్ ఆధ్వర్యాన 2వేల మందికి అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

బూర్జ: మండలంలోని తుడ్డలిలో గురు పౌర్ణమి సందర్భంగా శిర్డీ సాయిబాబా ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ ధర్మకర్త కనపాక చౌదరినాయుడు ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అర్చకులు చెరువు జగన్నాథం, జోష్యుల ఆంజనేయ శర్మ పాల్గొన్నారు.

బురదగుంటలే మార్గం

కవిటి: మండలంలోని ప్రగడపుట్టుగ నుంచి ఈదుపురం వెళ్లే మట్టి రహదారి అడుక్కో మడుగులా తయారైంది. స్థానికులతో పాటు ఎంతో మందికి ఈ బురదగుంటలే రహదారిగా మారాయి. గత కొన్నేళ్లుగా ఈ రహదారి గురించి పట్టించుకున్న నాథుడే లేకపోవడంతో ప్రస్తుతం ఆ రహదారి నడవడానికి కూడా వీలులేని విధంగా తయారైంది. ముఖ్యంగా ఈ రహదారి ప్రాంతంలో సగభాగం చినుకు పడితే చిత్తడిగా మారుతోంది. దీనికి తోడు రోడ్డుకి ఇరువైపులా ఉన్న ముళ్లపొదలు రోడ్డుపైకి వచ్చి వాహనదారులకు, బాటసారులకు ఇబ్బందులు కలిగిస్తున్నాయి. ప్రగడపుట్టుగ, రామయ్యపుట్టుగ గ్రామాల నుంచి రోజూ తోట పనులకు వెళ్లే రైతులతో పాటు జల్లుపుట్టుగ, డిజి పుట్టుగ, తిప్పనపుట్టుగ, ఈదుపురం, ఇచ్ఛాపురం వెళ్లేందుకు ఎంతోమంది ఇదే రహదారిని ఉపయోగిస్తున్నారు. అయితే కొంతకాలంగా ఈ రహదారి పరిస్థితి దారుణంగా తయారవడంతో వాహనదారులతో పాటు స్థానికులు తాము నిత్యం నిర్వహించే పనులకు వెళ్లేందుకు కూడా ఇబ్బంది పడుతున్నారు. ఇప్పటికైనా స్థానిక నాయకులు సమస్యను గుర్తించి తమకు నాణ్యమైన రహదారి సౌకర్యం కల్పించాలని స్థానికులు కోరుతున్నారు.

బురదగుంటల్లా మారిన రహదారి

విద్యుదాఘాతంతో బాలుడు మృతి

ప్రజాశక్తి- మెళియాపుట్టి

మహేష్ మృతదేహం

మండలం లోని గొప్పిలిలో ఐదో చదువుతున్న నాగపు మహేష్ (11) విద్యార్థి విద్యుదాఘాతంతో మృతి చెందారు. వివరాల్లోకి వెళ్తే... గొప్పిలి పాఠశాలలో ఉదయం నిర్వహించిన మెగా పేరెంట్స్ సమావేశంలో పాల్గొన్నాడు. తోటి విద్యార్థులతో సరదాగా గడిపాడు. ఆడుతూ, పాడుతూ తిరిగాడు. ఉపాధ్యాయులు చెప్పిన పాఠాలు శ్రద్ధగా విన్నాడు. సాయంత్రం స్నేహితులతో కలిసి ఆనందగా ఇంటికి చేరుకున్నాడు. కుమారుడికి తల్లి లక్ష్మి బిస్కెట్లు ఇచ్చింది. ఇంతలోనే తన ఇంటి మేడపై మొక్కను నాటేందుకు వెళ్లాడు. అప్పటికే తెగి ఉన్న విద్యుత్ వైర్‌ను తాకడంతో షాక్‌కు గురై ప్రమాద స్థలంలోనే మృత్యువాత పడ్డాడు. కొద్ది సమయం తరువాత తల్లి వెళ్లి చూడగా కాలిన గాయాలతో కుమారుడు పడి ఉన్నాడు. వెంటనే స్థానికులతో కలిసి పరిశీలించగా, అప్పటికే మృతి చెందారు. దీంతో తల్లి గుండెలవిసేలా రోదిస్తుంది. దీంతో గ్రామంలో విషాదం ఛాయలు అలముకున్నాయి. మృతుడి తండ్రి చంద్రరావు రెండు నెలల క్రితం అనారోగ్యంతో మృతి చెందాడు. రెండు నెలల వ్యవధిలో తండ్రీకొడుకులు మృతి చెందడంతో వారి రోదన వర్ణనాతీతం. చిన్న వయసులోనే కుమా రుడు మృతి చెందడంతో కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరవుతున్నారు. తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ పి.రమేష్‌బాబు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మాట్లాడుతున్న డిఎస్‌పి వి.వి అప్పారావు

గంజాయితో ముగ్గురు అరెస్టు

ప్రజాశక్తి- పలాస

పలాస-కాశీబుగ్గ పద్మనాభపురం కాలనీకి చెందిన ముగ్గురు వ్యక్తులు అక్రమంగా గంజాయి తరలిస్తుండగా పట్టుబడ్డారని డిఎస్‌పి వి.వెంకట అప్పారావు తెలిపారు. కాశీబుగ్గ పోలీస్‌స్టేషన్‌లో గురువారం విలేకరులతో మాట్లాడారు. పద్మనాభపురానికి చెందిన మామిళ్ళ మల్లేశ్వరరావు, తెలంగాణ రాష్ట్రం మంచిర్యాల జిల్లాకు చెందిన దుర్గం రఘుకుమార్, గోదారి స్వామీలు విజయవాడలో క్యాటరింగ్ షాపులో పరిచయం పనిచేస్తూ... స్నేహితులయ్యారని అన్నారు. తెలంగాణ చెందిన ఇద్దరు వ్యక్తులు వారి ప్రాంతంలో చిన్నచిన్న ప్యాకెట్లుగా చేసి అమ్మకం చేస్తున్నారని అన్నారు. ఒడిశా రాష్ట్రంలో రెండు కిలోలు గంజాయిని కొనుగోలు చేసి బరంపురంలో రైల్వే స్టేషన్ నుంచి ఆటోలో తరలిస్తున్నట్లు పలాస వచ్చారని తెలిపారు. ద్విచక్ర వాహనంపై గంజాయి పట్టుకుని పలాస రైల్వే స్టేషన్‌కి వెళ్తుండగా... పోలీసుల తనిఖీలో పట్టుబడినట్టు తెలిపారు. గంజాయి అక్రమ రవాణాపై నిఘా పెట్టామని, గంజాయితో పట్టుబడితే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. పిల్లలు ఏమి చేస్తున్నారో తల్లిదండ్రులు దృష్టిసారించాలని కోరారు.

నేడు వాహనాల వేలం పాట

కొత్తూరు : స్థానిక ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ స్టేషన్‌లో వివిధ కేసుల్లో పట్టుబడిన రెండు ద్విచక్ర వాహనాలను శుక్రవారం 10 గంటలకు వేలం పాట నిర్వహిస్తున్నట్లు సిఐ బి.హెచ్.మనీశ్వరి ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి ఉన్న వారు వేలం పాటలో పాల్గొనాలని కోరారు.

పారదర్శకంగా సంక్షేమ పథకాల అమలు



పొందూరు : పోస్టర్‌ను అందజేస్తున్న ఎమ్మెల్యే రవికుమార్

ప్రజాశక్తి- పొందూరు

రాష్ట్రంలో అర్హులందరికీ సంక్షేమ పథకాలను అందిస్తూ పారదర్శకమైన పాలనను అందిస్తున్న ఘనత కూటమి ప్రభుత్వానికి దక్కుతుందని ఎమ్మెల్యే కూన రవికుమార్ అన్నారు. మండలంలోని లోలుగులో తొలి అడుగు కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పార్టీలకు అతీతంగా అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలను అందిస్తున్నామని అన్నారు. ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాలు అందుతున్నదీ లేనిది అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో డిసిసిబి చైర్మన్ శివ్వాల సూర్యనారాయణ, నియోజకవర్గ ఇన్‌ఛార్జి తాడిబోయిన చంద్రశేఖరరావు, టిడిపి మండల అధ్యక్షుడు చిగిలిపల్లి రామ్మోహన్, పిఎసిఎస్ అధ్యక్షులు వండాన మురళీ, మాజీ ఎఎంసి చైర్మన్ అన్నెపు రాము, తెలుగుయువత జిల్లా ప్రధాన కార్యదర్శి బలగ శంకరభాస్కరరావు, టిడిపి మండల ఉపాధ్యక్షుడు బాడాన శేషగిరి, నాయకులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ధ్యేయం

మెళియాపుట్టి: కూటమి ప్రభుత్వం ఏడాది పాలన పూర్తయిన సందర్భంగా సుపరిపాలనలో తొలి అడుగు పేరిట గురువారం మండలంలోని పెద్దలక్ష్మీపురం, లింగుపురం గ్రామాల్లో నిర్వహించారు. కార్యక్రమంలో పిఎసిఎస్ అధ్యక్షులు సలాన మోహనరావు, టిడిపి మండల అధ్యక్షులు నంబాల వెంకటరావు, బూర్ల లలితకుమారి, బొచ్చు ప్రసాదరావు, రవ్వల గణపతిరావు, బసవ పరమేశ్వరరెడ్డి, సయ్యద్ సిలార్, ఢిల్లీరావు, తిరుపతిరావు, శశిభూషణరావు తదితరులు పాల్గొన్నారు.

కొత్తూరు : మండలంలోని బలదలో సుపరిపాలన తొలి అడుగులో భాగంగా ఎమ్మెల్యే మామిడి గోవిందరావు గురువారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి ఏడాది పాటు చేపట్టిన సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో టిడిపి మండల కన్వీనర్ అగతముడి మాధవరావు, టిడిపి నాయకులు మాతల గాంధీ, ఆగతముడి అరుణకుమార్, వి.వెంకటరావు, ఎం.వెంకటరావు, రమణమూర్తి, దశరథలు పాల్గొన్నారు.